



# సప్నోంకా సౌదాగర్

'వసుంధర'

**ఆమె పేరు రూపసి. పేరులో ఏముందనడాని కామె చెప్పుకోతగ్గ ఉదాహరణ.**

**ఆమె రంగు నలుపు. పళ్లు ఎత్తు. ఒళ్లు మాత్రం ఎత్తుపల్లాలతో అమరికగా ఉన్నప్పటికీ, ముఖం కారణంగా అంతా ఆమెను 'కురూపసి' అంటారు.**

రూపసి బియ్యే పాసయింది. బ్యాంకు ఉద్యోగిని. తల్లిదండ్రులు కట్నమివ్వలేరు గానీ, ఆమె జీతానికి ఆశపడరు. ఆ జీతాన్ని ఎరగా తీసుకునే మగాడింకా దొరక్క ఆమెకు పెళ్లి కాలేదు.

అది రూపసి దౌర్భాగ్యమో ఏమో, ఆమెలో భారతనారికి మామూలుగా ఉండాల్సిన దానికంటే ఎక్కువ మోతాదులో ఉన్నాయి కోరికలు. అందుకని తరచుగా మగవాళ్ల వేటలో ఉండేది. అయితే ఆమెలోని కోరికను చదవగలిగిన ప్రతి మగాడూ తనో జింకగా మారిపోయి ఆమెలో క్రూరమృగాన్ని చూసేవాడు. అలాంటి సమయంలో సూర్యారావు ఆమెలో ఆశాదీపం వెలిగించాడు.

ఆ వీధిలో సౌజన్య అపార్ట్‌మెంట్సున్నాయి. ఆరంతస్తుల భవనంలో అంతస్తుకు మూడేసి చొప్పున ఇళ్లున్నాయి. అందులో మూడో అంతస్తులో కుడి వైపు ఇంట్లో రూపసి, ఎడమ వైపు ఇంట్లో సూర్యారావు. వాళ్లిద్దరే పెళ్లి కానివారు.

మధ్య ఇంట్లో కొత్త దంపతులుంటున్నారు. భర్త ముత్యాలరావు కడిగిన ముత్యంలా ఉంటాడు. భార్య వసంత నిత్యవసంతమై శోభిస్తూంటుంది. వారిది చూడముచ్చటగా ఉండే జంట.

ముత్యాలరావు ఉద్యోగం మంచిదే కానీ, అతడికి తలకు మించిన బాధ్యతలున్నాయి. వచ్చే జీతం బొటాబొటిగా కూడా సరిపోదు. ప్రతి నెలా ఇంటికి మనియార్డరు పంపించి తీరాల్సిందే! మరీ కటకటగా ఉన్నప్పుడతడు సూర్యారావును అప్పడుగుతాడు. ఇంటి అవసరాలకు వసంత, రూపసి దగ్గర చేబదుల్లు తీసుకుంటుంది. అదీ ఆ అంతస్తు పరిచయం.

సూర్యారావునూ, రూపసినీ ఆ దంపతులు అప్పుడప్పుడూ 'టీ'కీ, అరుదుగా భోజనానికీ పిలుస్తూంటారు. అలా రూపసికీ, సూర్యారావుకూ పరిచయమైంది.

పైకి చెప్పడు కానీ, సూర్యారావుకు వసంత అంటే గొప్ప ఆకర్షణ ఉంది. ఆమె పలికితే పరవశం. నవ్వితే పులకరింత. మామూలు వాళ్లకు అవి తెలియవు కానీ, మగాళ్ల వేటలో ఉన్న రూపసి పసికట్టేసింది. ఆ విధంగా సూర్యారావు తనకు తెలియకుండానే ఆమెలో ఆశాదీపం వెలిగించాడు.

సూర్యారావుదీ తనవంటి పరిస్థితేనని అర్థమయ్యాక రూపసి ఏదో వంకన సూర్యారావును పలకరించి అతణ్ని అపరిమితంగా పొగుడుతూండేది. అందగత్తె కాకపోయినా ఆడపిల్ల కావడం వల్ల ఆమె పొగడ్తలు సూర్యారావును బలంగానే తాకేవి. ఆమె తనను ఆరాధిస్తున్నదని అతడికనిపించింది.

ఇద్దరూ అక్కడక్కడా అప్పుడప్పుడూ కలుసుకుని మాట్లాడుకునేవారు. ఆ మాటల్లో ప్రేమ, పెళ్లిళ్ల ప్రసక్తి రానేవచ్చేది. తనకాట్టే ఆశలు లేవనీ, ఎలాంటి వాడైనా తన్ను నిరాదరణచేయని భర్త అయితే చాలుననీ రూపసి అంటే, "నాక్కాబోయే భార్య వసంతలా ఉండాలని నా కోరిక!" అన్నాడు సూర్యారావు.

రూపసి ఆశ్చర్యపోలేదు. అతడు చెప్పకమునుపే ఆమెకి విషయం తెలుసు. కాబోయే భార్య వసంతలా ఉన్నా, ఉండకపోయినా, వేరొకరి భార్య అయిన వసంత అతడికి కావాలనీ ఆమెకు తెలుసు. అతడి నోట ఈ మాట అనిపించాలనే ఆమె అతడితో తన చనువును పెంచింది. ఫలితం కనిపించగానే, "పరిచయానికి అందం కావాలి. కానీ అందం పరిచయాన్ని నిలబెట్టుకోలేదు!" అందామె.

"ఆడవారి మాటలకు అర్థాలు వేరులే!" అన్నది మగాడు. ఎందుకంటే మాట్లాడేటప్పుడు ఆడది ఎంతో లోతుగా ఆలోచించి పదాలు వాడుతుంది. మగాడి కా ఆలోచన అవసరం కనపడదు. అందుకని రూపసి తన మాటల అర్థాన్ని తనే వివరించేదాకా అసలు విషయం సూర్యారావుకు తెలియనేలేదు.

వసంతకు తను అందగత్తెనని తెలుసు. తనకే కాదు. తన భర్తకు ఇతరుల నుంచి అందే సాయం వెనుక కూడా తన అందమున్నదని ఆమెకు తెలుసు. తన భర్త తన అందానికి న్యాయం చేకూర్చడం లేదని ఆమె అభిప్రాయం. అలాంటప్పుడు తన అందానికి న్యాయం జరిగే ఏ మార్గమైనా తప్పు కాదని ఆమె నవ్వుతోంది.

"నువ్వు పెళ్లి చేసుకుంటే నీ కోరికలు తీర్చగలవాడినే చేసుకో, అందం కోసం చూడకు!" అని వసంత రూపసికి సలహా ఇచ్చింది.

ముత్యాలరావు అప్పుడప్పుడూ రూపసిని కలుసుకుని, "మగాడిక్కావలసింది అందమైన భార్య కాదు, మనశ్శాంతినిచ్చే ఆడది. మధ్యతరగతి జీవితాల్లో అన్ని అశాంతులకూ మూలం డబ్బు. రూపంతో నిమిత్తం లేకుండా మంచి ఉద్యోగమున్న పిల్లను చేసుకునుంటే నా జీవితమెంతో సుఖంగా ఉండేది!" అంటూంటాడు. ఆమె చొరవ ఇవ్వలేదు కానీ అతడికామెపై మనసుంది.

ఈ వివరాలన్నీ తెలిశాక, 'పరిచయానికి అందం కావాలి కానీ, అందం పరిచయాన్ని నిలబెట్టుకోలేదు' అన్న మాటల అర్థం సూర్యారావుకూ తెలిసింది.

మగాడు కోరుకునే తోడు వసంతలా కాక, రూపసిలా ఉండాలని వసంతను చేసుకున్న మగాడు అభిప్రాయపడుతున్నాడు. ఇదీ రూపసి సూర్యారావుకు చెప్పాలనుకున్నది. కానీ, తన అందానికి న్యాయం జరిగే ఏ మార్గమైనా తప్పు కాదని వసంత నమ్ముతోందన్న సందేశం మరింత బలంగా అతడిని చేరింది.

తన ఆశను ఆవేశంగా మార్చి నటిస్తూ, "ఆడవాళ్లకు అసూయ అనంతం. మీరు ఓ అమాయకురాలి శీలాన్ని కించపరుస్తున్నారు!" అన్నాడు సూర్యారావు.

"అందుకు రుజువేమిటి?" అంది రూపసి.

"పోనీ, మీ మాటలు నిజమని రుజువు చేయగలరా?" అన్నాడు సూర్యారావు తన ఆశను మరింత పెంచుకుంటూ.

"ఆ అవసరం నాకు లేదు. రుజువు మీద మీకంత మోజుగా ఉంటే, అందుకు ఖర్చవుతుంది. మీరు భరించగలరో, లేదో నాకు తెలియదు!" అంది రూపసి.

"ఎంతవుతుందేమిటి?" ఆత్రుతగా అడిగాడు సూర్యారావు.

"వేలలో ఉండొచ్చు..."

సూర్యారావు అనుమానంగా, "ముందుగా మాత్రం ఇవ్వను!" అన్నాడు.

"ఇలాంటి విషయాల్లో నమ్మకం ముఖ్యం. ఆమెకు విషయం చెబుతాను. నచ్చితే తన ఫొటోను మీకు అందజేస్తుంది. ఆ తర్వాత నుంచి వాయిదాల పద్ధతిలో ముందుగా డబ్బు చెల్లించాలి!" అంది రూపసి.

మర్నాడు సూర్యారావు ఆఫీసు నుంచి ఇంటికొచ్చేసరికి తలుపు సందుల్లోంచి పడేసిన తెల్లని కవరొకటి ఉంది. తెరిస్తే అందులో ఓ ఫొటో-వసంత ముగ్ధమనోహరంగా నవ్వుతూ...

## పవన్ చిన్ననాటి ముచ్చట్లు

చిన్నప్పుడు పవన్‌కల్యాణ్ మహాచిలిపి. చదువుకన్నా ఆటపాటలమీద దృష్టి ఎక్కువ. మద్రాసులో వాళ్లన్నయ్య చిరంజీవి ఇంట్లో ఉండి చదూవుకునేవాడు. అన్నయ్య అంటే మొదట్నుంచీ పవన్‌కి గౌరవంతో కూడిన భయం. అలా అని పవన్‌ని చిరంజీవి తిట్టడం, కొట్టడం ఎప్పుడూ చేసేవాడు కాడు. ఏదైనా తప్పు చేస్తే అదెందుకు తప్పో, ఎలా తప్పో చెప్పేవాడు. అన్నయ్య కన్నా, వదినదగ్గరే పవన్‌కి చేరువ ఎక్కువ. అమ్మలా ఆవిడ పవన్‌ని తీర్చిదిద్దేది. ఒకసారి పవన్ ప్రోగ్రెస్ రిపోర్ట్ తెచ్చాడు. అన్ని సబ్జక్టుల్లో సింగిల్ డిజిట్‌లోనే మార్కు లొచ్చాయి. ఆ రిపోర్టు చూసి ఇంట్లో ఎక్కడ తిడతారో అని ఒక్కోమార్కుకు ముందు మరో అంకె చేర్చాడు. ఆ విషయం వాళ్ల వదినగారు గ్రహించారు. "నీ పనే బావుందయ్యా...ఒక్క మార్కు తెచ్చుకుంటే చాలు...ఆ ముందు మరో అంకె వేసుకుని కావలసనన్ని మార్కులు సంపాయించుకోవచ్చు" అని నవ్వుతూనే చురక వేశారట ఆవిడ. "ఈ విషయం మా అన్నయ్యకి ఇప్పటిదాకా తెలిసుండదని అనుకుంటున్నా" అన్నాడు; చిన్ననాటి ముచ్చట్లు సంబరంగా నెమరేసుకుంటూ.

-ఎస్.



## ఫాస్ట్ 'తమ్ముడు'

'అక్కడ అమ్మాయిఇక్కడ అబ్బాయి', 'గోకులంలో సీత', 'సుస్వాగతం', 'తొలి ప్రేమ'....ఇప్పుడు తాజాగా 'తమ్ముడు'. ఈ అయిదు చిత్రాలతోనే స్టార్ ఇమేజ్ సంపాదించాడు పవన్‌కల్యాణ్. మార్షల్ ఆర్ట్స్ అయినా, నటనైనా, కథ అయినా పెర్‌ఫెక్షన్‌కోసం తపన పడే పవన్‌కల్యాణ్‌కు అసలు సినీరంగంలో ఏ డిపార్ట్‌మెంట్ అంటే ఎక్కువ ఇష్టమో తెలుసా...డైరక్షన్. పరిశ్రమలోకి వచ్చిన అనతికాలంలోనే స్టార్ అయినట్లు అంతే ఫాస్ట్‌గా డైరక్షన్ కూడా చేసేస్తాడేమో చూడాలి. అన్నట్లు ఆయనకు నిర్మాతగా మారే ఆలోచనకూడా ఉందట.

'తమ్ముడు' యమ ఫాస్ట్.



ఫొటో వెనుక 'ప్రేమతో వసంత' అని ఉంది.

సూర్యారావు థ్రిల్లయిపోయాడు. ఆ ఫొటోను ఆగకుండా ముద్దు పెట్టుకున్నాడు. అయితే తర్వాత ఏం చేయాలో అతడికీ తెలియలేదు.

రూపసిని కలుసుకున్నాడు.

"అంతా వసంత నాకు చెప్పింది. తనకు వ్యతిరేకంగా ఏ రుజువులూ ఉండకూడదని ఆమె ఉద్దేశ్యం. అందుకే ఫొటో వెనుక మీ పేరు రాయలేదు. మీకు నమ్మకం ఏర్పడితే నాకు వెయ్యి రూపాయలివ్వండి. ఆమెకందజేస్తాను. రేపు సాయంత్రం ఇందిరా పార్కుకు వస్తుంది. అరగంటే ఉంటుంది. మీకు తోచినవి మాట్లాడుకోండి!" అంది రూపసి.

ఫొటో ఇచ్చిన నమ్మకంతో సూర్యారావు ఆమెకు వెయ్యి రూపాయలూ ఇచ్చాడు.

మర్నాడు రూపసి అతణ్ని కలుసుకుని, "ఆమె సరిగ్గా అయిదింటికి పార్కుకు వస్తుంది. అరగంటే ఉంటుంది. భర్త ఆరింటికల్లా ఇంటికి వస్తాడు. అప్పటికామె ఇంట్లో ఉండాలి. అందుకని అయిదూ, అయిదున్నర మధ్యలో మీరామెతో ఏం మాట్లాడతారో మాట్లాడుకోండి. ఆమె అక్కడికి మీ కోసం కాక నాకోసం వచ్చినట్లు మాట్లాడుతుంది. నమ్మండి. ఆమె ఏం చెప్పినా నా పేరుతో చెబితే సరే ననాలి తప్ప, ఎదురు ప్రశ్నలు వెయ్యకూడదు. ఓ ఆడది... అందులోనూ వివాహిత... సంకోచాన్ని అర్థం చేసుకుని అవగాహనతో సహకరించండి!" అని చెప్పింది.


కథ ముందుకు నడుస్తున్నదని సూర్యారావు పొంగిపోయాడు. సాయంత్రం అనుకున్న టైముకు వెడితే పార్కులో వసంత కనిపించింది.

ఆమె అతణ్ని చూసి ఆశ్చర్యపడితే, అతడూ ఆశ్చర్యాన్ని నటించాడు.

ఇద్దరూ కాసేపు కబుర్లు చెప్పుకున్నారు. రూపసి రాలేదేమని ఆమె పదేపదే అనుకుంటే, ఆ నటనకు అతడు మనసులోనే నవ్వుకున్నాడు. అయితే వారి సంభాషణలో ఎక్కడా శృంగారం చోటు చేసుకోలేకపోయింది. ఆమె ఇబ్బందిగా కూర్చుంది. అతడూ చొరవ చేయలేకపోయాడు.

"ఇంకెప్పుడూ రూపసి మాటలు నమ్మను!" అనుకుంటూ సరిగ్గా అరగంటలో వెళ్లిపోయింది వసంత. ఆ అరగంట అనుభవం సూర్యారావుకు చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. ఆ తర్వాత జీవితమే శూన్యమనిపించింది.

ఆ రాత్రి అతడికి వసంత కలలోకొచ్చింది.




ఆమెను పార్కులో కలుసుకున్నాక తీరని కోరికలు కొంత వరకూ ఆ కలలో తీరాయి. ఆమె అతడికి పూర్తిగా లొంగిపోయేదే. ఎందుకో చటుక్కున అతడికి మెలకువ వచ్చేసింది. ఆ తర్వాత ఎంత ప్రయత్నించినా అతడికి నిద్ర రాలేదు.

మర్నాడు రూపసి అతణ్ని కలిసి "ఆమె మిమ్మల్ని దగ్గర్నుంచే పరీక్షగా చూసింది. తనకు మీరు నచ్చారు. మరో వెయ్యి రూపాయలివ్వండి. కథ ఇంకా ముందుకు నెడుతుంది!" అని అతడిచ్చిన డబ్బు తీసుకుని వెళ్లింది.

వసంతకు తను నచ్చినందుకు సూర్యారావు మురిసిపోయాడు. అతడు తన్ను తాను ముత్యాలరావుతో పోల్చుకున్నాడు. అతడికంటే తాను ఎంతో ఉన్నతుడిననిపించి, "పాపం, ఈ జన్మకామె ముత్యాలరావునే భర్తగా భరించక తప్పదు. నన్ను ప్రియుడుగానే సరిపెట్టుకోవాలి!" అని వసంత మీద జాలిపడ్డాడు.

ఆ రాత్రి మళ్లీ అతడి కలలోకి వచ్చిన వసంత తనే చొరవ చేసి అతణ్ని రెచ్చగొట్టింది. మధ్యలో ముత్యాలరావొచ్చినా ఆమె సూర్యారావును వదల్లేదు. బలిమలాడినా భార్య వినకపోవడంతో ముత్యాలరావు కోపంతో చెయ్యి చేసుకోబోయాడు.

అప్పుడు వసంత "చూస్తారేం, మీరు మగాళ్లు కాదా?" అంది సూర్యారావుతో.

సూర్యారావుకు పౌరుషం వచ్చి ముత్యాలరావును బలంగా వెనక్కు తోశాడు.

"నేను దీనికి విడాకులిస్తాను. నువ్వే పెళ్లి చేసుకో!" అంటూ ముత్యాలరావు వెళ్లిపోయాడు. సూర్యారావుకు మెలకువ వచ్చేసింది.

వసంతకూ, తనకూ సంబంధమేర్పడితే, ముత్యాలరావామెను విడిచిపెడితే, తనామెను పెళ్లి చేసుకుంటాడా?

ఈ ఆలోచన అతడిలోని శృంగారభావాల పైన పెద్ద దెబ్బే తీసింది. ఈ జన్మకే వసంత భార్య అయ్యే అవకాశం తనకు లభిస్తుందంటే కలలో కూడా అతడికంత సంతోషంగా లేదు. మరి వసంతంటే తనకున్న భావమేమిటో!

ఆ తర్వాత నాలుగైదు రోజులు రూపసి అతణ్ని తప్పించుకు తిరిగింది. అతడిలో ఆత్రుత పెరిగిపోతోంది. రాత్రులు కలలు... వాటిలో వసంత జోరు నానాటికీ పెరిగిపోతోంది.

చివరికొక రోజున అతడు రూపసిని పట్టుకోగలిగాడు.

"పరిస్థితులు అనుకూలంగా లేవు. ఇంకా నాలుగు రోజులు ఆగాలి. ఈ లోగా మీకు చెప్పేదేమీ లేదని కలుసుకోలేదు. కథ క్లైమాక్స్‌కు వచ్చేలోగా మీకు వసంత నుంచి ఇంకో ఉత్తరం అందుతుంది. అప్పుడు నాకు మరో వెయ్యి

రూపాయలివ్వాలి. ఆ తర్వాత మీరు నన్ను కాదు -వసంతనే కలుసుకుంటూంటారు..." అంది రూపసి.

నాలుగు రోజుల తర్వాత అతడి గదిలో ఓ కవరు-అందులో ఉత్తరం. అందులో చేతివ్రాతకు బదులు అతికించిన అచ్చు అక్షరాలు.

"మొదటిసారి కలుసుకున్నప్పుడు మీతో నాకిలా ఇష్టం!" అని రాసి ఉందా ఉత్తరంలో. ఆ ఉత్తరానికి జతపరచి అచ్చైనా ఓ పచ్చి శృంగారకథ ఉంది.

ఆ కథ చదవగానే అతడికి వెంటనే వెళ్లి వసంత ఇంటి తలుపు తట్టాలన్నంత ఆవేశం కలిగింది. ఎలాగో తమాయించుకున్నాడు. ఆ రాత్రికతడు పట్టిన కలత నిద్రలో కలలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

మర్నాడు రూపసి అతడి నుంచి వెయ్యి రూపాయలు వసూలు చేసి, "ఈ రాత్రికి ఏడున్నరకు ఇంట్లో ఉండండి. ఆమె వస్తుంది!" అంది.

అప్పటి సూర్యారావు మనఃస్థితి మాటల్లో చెప్పడం కష్టం. ఎలాగో రాత్రి ఏడున్నర దాకా క్షణాలు యుగాల్లా గడిపాడు.

రాత్రి ఏడున్నర...

సూర్యారావు ఎదురుచూస్తున్న మధురక్షణానికి తలుపు తట్టిన మధురసంగీతం జతపడింది.

అతడి కాళ్లు వణికాయి. లేచి నిలబడితే తనువంతా వణికింది. తలుపులు తీయబోతే చేతులు వణికాయి. తలుపు తెరుస్తూండగా మనసే వణికింది.

తలుపులు తెరుచుకున్నాయి.

వచ్చింది వసంత కాదు, రూపసి!

ఒక్కసారిగా సూర్యారావుకు అన్ని వణుకులూ ఆగిపోయాయి. "మీరా?" అన్నాడు నిరుత్సాహంగా.

రూపసి తలుపులు దగ్గరగా వేసి, "ముత్యాలరావు ఊరెడుతున్నాడు. ఇంకో అరగంటలో ప్రయాణం. అంత వరకూ వసంత మీకు కంపెనీ ఇవ్వమంది!" అంది.

సూర్యారావు అసహనంగానే ఆమెతో అరగంటసేపు మాట్లాడాడు. అయితే కోరికలతో నిండి ఉన్న అతడి మనసు ఆమె ముఖసౌందర్యాన్ని పట్టించుకోవడం లేదు. అప్పుడప్పుడు ఆమె ఆడతనానికి చలిస్తోంది కూడా!

అరగంట గడిచింది. రూపసి తనే బయటకు వెళ్లి తిరిగి వచ్చి, "ఐయామ్ సారీ! వసంతకు మూడో నెలట. ముత్యాలరావామెను బలవంతపెట్టి పుట్టింట్లో దింపుతానన్నాట్ట. వాళ్లిద్దరూ కూడా ఊరెళ్లిపోయారు!" అంటూ చావు కబురు చల్లగా చెప్పింది.

సూర్యారావు గుండె గుభిల్మంది. "అంతా మోసం! నువ్వూ, ఆమే కలిసి నా దగ్గర మూడు వేలు కాజేశారు!" అన్నాడు.

"ఏ మోసమూ లేదు! ఆ మాత్రం ఖర్చు పెట్టకుండా వసంత మీకు మానసికంగా అంత దగ్గరయ్యేదా? వసంతలాంటి సంసారస్త్రీలు కావాలనుకుంటే మానసికవ్యభిచారాని క్కూడా ఖర్చు తప్పదు మరి!" అంది రూపసి తాపీగా.

సూర్యారావు చటుక్కున ఆమె చేయి పట్టుకుని, "నా మూడు వేలూ కాజేశావు. ఆ విలువ నీ నుంచి రాబట్టుకుంటాను!" అంటూ దగ్గరగా లాక్కున్నాడు.

రూపసి అతణ్ని వెనక్కు తోసి, "అందుకు నేను పనికొస్తానని తెలిసీ వసంత కోసం ఎందుకు పాకులాడారు? మీ మూడు వేలూ వెనక్కిస్తాను. మీతో ఇలాంటి ఆవేశం పుట్టించగల కలలను ప్రతి రోజూ మీకు అమ్మగలను-పైసా తీసుకోకుండా! నన్ను పెళ్లి చేసుకోండి. మీ బలహీనతలు తెలిసినదాన్ని... నాకంటే ఎక్కువగా మిమ్మల్నర్థం చేసుకుని సహకరించగల ఆడది మీకు దొరగదు. ఆలోచించుకోండి..!" అని అక్కణ్నుంచి వెళ్లిపోయింది.

సూర్యారావు ఆలోచనలో పడ్డాడు.

తనామె చేయి పట్టుకున్నాడు.

పాణిగ్రహణం చేయమంటోందామె.

రెండూ ఒకటే కదా అనుకోగలడా?

ఆ రాత్రి రూపసి అతడి కలల్లోకి వచ్చింది. ■

## ట్రెండ్ సెట్టర్

కోడి రామకృష్ణ తెలుగు సినిమాల్లో ఏది మొదలుపెట్టినా, అది ట్రెండే అవుతుంది. ఒకప్పుడు ఆయన సినిమాల్లోనే ద్వంద్వార్థాల మాటలు మొదలయ్యాయి. అదో ట్రెండ్ అయి కూర్చుంది. తరువాత తన సినిమాల్లో ప్రతి విలన్‌కూ ఓ మానరిజమ్ పెట్టారు. అదీ ఓ ట్రెండ్ అయిపోయింది. ఇప్పుడు కోడి రామకృష్ణ స్పెషల్ ఎఫెక్ట్సమీద పడ్డారు. 'అమ్మోరు', 'దేవి' తరువాత ఆయన వెంకటేశ్‌తో భారీ స్పెషల్ ఎఫెక్ట్స్ సినిమా ప్లాన్ చేశారు. 'దేవి' చిత్రనిర్మాత ఎం.ఎస్. రాజా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ ముగ్గురి కాంబినేషన్‌లో 'శత్రువు' హిట్ అయింది. హాలీవుడ్ సినిమాల్లా తెలుగులోకూడా ఇక ప్రతిసినిమా స్పెషల్ ఎఫెక్ట్స్‌తో రావడానికి ఈ సినిమా ఓ ట్రెండ్ సృష్టిస్తుందేమో. అయితే, మంచిదేగా.

ఎస్.



# సాహసబాలలు

## బాలుని కాపాడిన సత్యభామ!

ఒరిస్సా రాష్ట్రంలోని జైకైకెలా గ్రామంలో ఒక ఉపాధ్యాయుని కుమార్తె 11 సంవత్సరాల సత్యభామ సాహు. 1997 అక్టోబర్ ఒకటవతేది మధ్యాహ్నం 12 గంటల సమయంలో వాళ్ల అమ్మతో కలిసి ఆ గ్రామసమీపానే ప్రవహిస్తున్న బ్రాహ్మణి నదిలో స్నానం చేస్తోంది. అదే సమయంలో భీష్మ బెహరా అనే ఆరేళ్ల బాలుడుకూడా ఆ నదిలో స్నానంకోసం వచ్చి ఈతకొడు తుండగా ప్రవాహవేగం పెరిగి, ఆ కుర్రవాడు నిలవలేక మునిగి పోసాగాడు.

కొద్ది దూరంలో స్నానం చేస్తున్న సత్యభామ ప్రమాదాన్ని గుర్తించింది. వెంటనే ఈదుకుంటూ వెళ్లి... ఆ అబ్బాయిని నీటిపైకి ఎత్తి పట్టుకోవాలని చూసింది, కాని ఆ అబ్బాయి ఆసరాకోసం ఆమె కంఠాన్ని కరిచి పట్టుకున్నాడు. దాంతో ఆమెకు ఊపిరి ఆడలేదు. పిల్లడి బరువుకు నీళ్లలోకి తానూ మునిగిపోసాగింది. అదృష్టవశాత్తు శేఖర్ అనే యువకుడు వారిద్దరి అవస్థ గమనించాడు. చుట్టుపక్కలవారి సహాయంకోసం గట్టిగా అరుస్తూ.. ఆ పిల్లలకు సహాయం చేయడానికి నీళ్లలోకి దిగాడు. అతని ప్రయత్నం కూడా ఫలించలేదు, కాని అపుడే అటుగా వెళుతున్న ఒక నావలోనివారు కొందరు చూసి నావను ఆ పిల్లలున్నవైపుకు తీసుకువెళ్లి వాళ్లను ఒడ్డుకు చేర్చారు.



తాను ప్రమాదంలో చిక్కుకునేంత సాహసానికి పూనుకుని, బాలుని కాపాడిన సత్యభామ సాహును జాతీయస్థాయి సాహస బాలికగా ఎంపికచేశారు.

అనిపెద్ది వెంకట రమణరావు. ■